## ఎంబీసీ ఎత్తిపోతల భూసేకరణకు ముందడుగు

**చింతలపాలెం, న్యూస్‌టుడే:** మండలంలోని వెల్లటూరు వద్ద కృష్ణానది వెంట నిర్మించ తలపెట్టిన ముక్త్యాల బ్రాంచి కెనాల్ (ఎంబీసీ) ఎత్తిపోతల పథకం భూసేకరణ ప్రక్రియకు అధికారులు ముందడుగేశారు. చింతలపాలెం రెవెన్యూ పరిధిలో ఈ ఎత్తిపోతల పంపుహౌస్ ఇతరత్రా నిర్మాణాలకు 68 ఎకరాలు, పైపులైను నిమిత్తం మరో 12.20 ఎకరాలు అవసరం ఉంటుందని నీటి పారుదల శాఖాధికారులు ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో.. ఈ భూసేకరణ నిమిత్తం ఆర్డీవో శ్రీనివాసులు చింతలపాలెంలో రైతులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఎకరానికి రూ. 16 లక్షలు ప్రభుత్వం నుంచి పరిహారం వస్తుందని తెలిపారు. రైతులు మాత్రం తమకు భూమికి బదులు భూమి లేదా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ పరిహారం ఇవ్వాలని కోరారు. దీంతో పాటు ప్రభుత్వ ప్రతిపాదిత భూసేకరణ అనంతరం తాము ఉపయోగించుకోలేని మిగిలిన మరో 30 ఎకరాలను అదనంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో ఈ సందర్భంగా పేర్కొన్నారు. తహసీల్దారు సురేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.



## గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

**సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లాలో గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. గ్రూప్-3 పరీక్ష నిర్వహణపై హైదరాబాద్ టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించిన దూర దృశ్య శ్రవణ సమీక్షలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో 30, కోదాడలో 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్. లత, డీఎస్పీ నర్సింహాచారి, రీజనల్ కోఆర్డినేటర్, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, శరత్ బాబు, ఏవో సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

**కోదాడ గ్రామీణం:** రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత సూచించారు. మండల పరిధిలోని గుడిబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీవో సూర్యనారాయణతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ వాజిద్, ఏవో రజని, ప్యాక్స్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్‌చైర్మన్ నరేష్, ప్రభాకర్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులను చట్టసభలకు పంపాలి

**మఠంపల్లి, న్యూస్‌టుడే:** పేదల పక్షాన నిలిచి నిరంతరం పోరాటాలు చేసే కమ్యూనిస్టులను బలపరిచి చట్టసభలకు పంపితే ప్రజలకే న్యాయం జరుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మఠంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ మండల సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఉద్యమాలు నడిపే కమ్యూనిస్టులకు మద్దతివ్వాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ సర్కారు ప్రజలకిచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పాండు, శేఖర్‌రావు, బి.పాండునాయక్, అనంతప్రకాశ్, పి.వెంకటరెడ్డి, వి.సైదులు, బాలునాయక్, రమ్మయ, లక్ష్మి పాల్గొన్నారు.

## తిరుమలగిరి మార్కెట్‌లో కొనుగోళ్లు బంద్

**తిరుమలగిరి, న్యూస్‌టుడే:** తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కొనుగోళ్లు జరగలేదు. ప్లాస్టిక్ సంచుల కారణంగా తమ చేతులు మండుతున్నాయని హమాలీ కార్మికులు, గోనె సంచుల కొరత ఉన్నందున ఆ సంచులనే తూకం వేయాలన్న వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా ఈనెల 16న మధ్యాహ్నం 3గంటల వరకు టెండర్లు పూర్తి కాలేదు. దీంతో ఆగ్రహించిన రైతులు



వెలవెలబోతున్న తిరుమలగిరి మార్కెట్ యార్డు

రాస్తారోకోకు దిగడంతో మార్కెట్ కార్యదర్శి, తహసీల్దార్ హమాలీ కార్మికులు, వ్యాపారులతో మాట్లాడి కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేశారు. బుధవారం కాంటాలు, ఎగుమతులు ఆలస్యం కావడంతో గురువారం మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. సమస్య పరిష్కారం కాకపోవడం, అధికారులు, వ్యాపారులు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో శుక్రవారం రైతులు తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురాలేదు. శనివారం మార్కెట్ నడుస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు చొరవ తీసుకొని కొనుగోళ్లకు ఆటంకం లేకుండా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

**ఉన్నతాధికారులకు తెలిపాం:**

శ్రీధర్, మార్కెట్ కార్యదర్శి

జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చాం. మరోసారి హమాలీ కార్మికులు, వ్యాపారులతో మాట్లాడతాం. సమస్య పరిష్కారం జరిగితే శనివారం మార్కెట్ నడుస్తుంది.

# పట్టాలు లేక.. కష్టాలు..!



వలిగొండ: అక్కంపల్లి సమీపంలో అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా టార్పాలిన్లు (పట్టాలు)

న్యూస్‌టుడే పరిశీలన


**భువనగిరి-వలిగొండ, న్యూస్‌టుడే:** ఏటేటా ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా.. ఆ మేరకు మౌలిక సదుపాయాల కల్పనలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. రైతులకు కనీసం మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా.. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొన్నేళ్లుగా కొనుగోళ్లు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నా.. సదుపాయాలు కొరవడి ఆర్థికంగా రైతులు నష్టపోతున్నారు.

● పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీఓల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ మౌలిక సదుపాయాలను సమకూర్చాల్సి ఉంది. మౌలిక సదుపాయాలను పూర్తిగా సమకూర్చడంలో ఆ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మౌలిక సదుపాయాలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పౌర సరఫరాల సంస్థ ప్రతి సీజన్‌లో ఆయా జిల్లాల మార్కెటింగ్ శాఖకు రూ.కోట్లలో మార్కెట్ రుసుము చెల్లిస్తున్నా.. కనీస సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టడం లేదు.

**కోతలు ప్రారంభమై.. కేంద్రాలు తెరుస్తున్నా...**

వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి చాలా చోట్ల చేతికి వచ్చింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక ప్రారంభమైంది. తేమ శాతం అధికంగా ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబెట్టుకుంటున్నారు. కానీ టార్పాలిన్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం శుభ్రం చేసేందుకు ప్యాడీ క్లీనర్లు కూడా సరిగా లేవు. సరిగా పని చేయడం లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో జిల్లాలో 75 శాతం కూడా లేవు. ఇక ధాన్యం తూర్పారబట్టే యంత్రాలు ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. తూకం యంత్రాలు సరిపడా లేవు. నూతన ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం తగ్గించేందుకు డ్రయర్లను కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేస్తేనే రైతులకు సౌకర్యంగా ఉంటుంది.

**ఉమ్మడి జిల్లాలో 2022-23లో పౌరసరఫరాల సంస్థ మార్కెటింగ్ శాఖకు చెల్లించిన ఆదాయం (కోట్లలో)**




**టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకుంటున్నాం:**

**బోడపట్ల నర్సిరెడ్డి, వ్యవసాయ రైతు, సంగెం, వలిగొండ మండలం**




కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు సరఫరా చేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద అద్దెకు తెచ్చుకోవాల్సి వస్తోంది. వర్షాలకు ధాన్యం తడిసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం సరఫరా చేయాలి. పదిహేను రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి.

**ఇండెంట్ పెట్టాం:**

**సబిత, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, యాదాద్రి భువనగిరి**

వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు కావాల్సిన యంత్రాలకు సంబంధించి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ఇండెంట్ పెట్టాం. టార్పాలిన్లు తక్కువగా ఉన్నా.. తెరిచిన కొనుగోలు కేంద్రాలకు ఇస్తున్నాం. ప్యాడీ క్లీనర్లు చాలా వరకు బాగానే ఉన్నాయి. 1,255 టార్పాలిన్లు, 365 విన్నోయింగ్ యంత్రాలు, 142 ప్యాడీ క్లీనర్లు, 170 తూకం యంత్రాలు అవసరమని లేఖ రాశాం.

**ఉమ్మడి జిల్లాలో ప్రతిపాదించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు**




**మార్కెటింగ్ సమకూర్చాల్సిన సదుపాయాలు**

| జిల్లా | టార్పాలిన్లు | | | ప్యాడీ క్లీనర్లు | | | తూకం మిషన్లు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | అవసరం | ఉన్నవి | కావాల్సినవి | అవసరం | ఉన్నవి | కావాల్సినవి | అవసరం | ఉన్నవి | కావాల్సినవి |
| నల్గొండ | 6500 | 6000 | 500 | 354 | 325 | 29 | 2000 | 1950 | 50 |
| సూర్యాపేట | 5500 | 5000 | 500 | 350 | 310 | 40 | 350 | 310 | 40 |
| యాదాద్రి | 4,845 | 3,567 | 1255 | 369 | 228 | 142 | 646 | 476 | 170 |

# ఓటర్ల పెంపునకు కసరత్తు

ఉమ్మడి వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీకాలం ముగుస్తుండటంతో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించింది. గత నెల 30 నుంచి నవంబరు 6 వరకు ఓటు నమోదుకు గడువు ఉండగా.. ఇప్పటికే సంబంధిత ఉపాధ్యాయ సంఘాల నాయకులు నూతన ఓటర్ల నమోదుపై దృష్టి సారించారు. ప్రత్యేకంగా సర్వీస్ కేంద్రాలు ఏర్పాటుచేసి ఓటు నమోదుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో ఓటుహక్కు ఉన్న వారు సైతం తిరిగి నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దిశగా ఓటరు జాబితా రూపకల్పనకు ఏర్పాట్లు చేపట్టాలని సూచిస్తున్నారు.

### దరఖాస్తు ఇలా..

ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఫారం-19 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంది. ధ్రువపత్రాలతోపాటు అదనంగా గత ఆరేళ్ల నుంచి ఎక్కడ బోధిస్తున్నారనే వివరాలు పేర్కొనాలి. అందుకు సంబంధించి ధ్రువపత్రాలు సైతం జత చేయాల్సి ఉంది. పూరించిన దరఖాస్తులను జిల్లాలోని సంబంధిత ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల్లో అందజేయాలి. ఆన్‌లైన్‌లో ceo.telangana వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

### ఉపాధ్యాయ సంఘాల దృష్టి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2019 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 7,243 మంది ఉన్నారు. దాదాపు 12 వేల మందికిపైనే ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులుండగా తక్కువ మంది ఓటు నమోదు చేసుకున్నారు. ఈ సారి ఓటర్ల సంఖ్య పెంచడానికి జిల్లా యంత్రాంగంతోపాటు ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా ఓటు నమోదుకు సర్వీస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరో 17 రోజులు మాత్రమే నమోదుకు అవకాశం ఉండటంతో ముమ్మరంగా అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2019లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు**

| జిల్లా | ఓటర్లు |
|---|---|
| నల్గొండ | 3,859 |
| సూర్యాపేట | 2,156 |
| యాదాద్రి | 1228 |

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర: కలెక్టర్

**పెన్‌పహాడ్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మండలంలోని అనాజీపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘబంధం అధ్యక్షురాలు అన్నామేరీతో కలిసి శుక్రవారం కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 లోపు ఉండే విధంగా ఆరబెట్టి, శుభ్రపరిచిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు ఎన్.అన్నారంలోని గోదాంను పరిశీలించారు.



అనాజీపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తదితరులు

**ఎంపీవోకు మెమో...** గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్నులు, మిషన్ భగీరథ నిర్వహణ దస్త్రాలను పరిశీలించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నుల వసూలు ఇంకా ప్రారంభించకపోవడంపై ఎంపీవోకు మెమో, పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో అప్పారావు, జిల్లా మార్కెటింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దారు లాలు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీవో సంజీవయ్య, ఏపీఎం అజయ్ నాయక్, ఏవో అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట కలెక్టరేట్:** జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు, పీఏసీఎస్ అధికారులు, ఐకేపీ సిబ్బంది, ఏపీఎంలతో వెబెక్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్. లతతో కలిసి ఆయన మాట్లాడారు. రైతులకు టోకెన్ జారీ చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు.



## ముఖ్యమంత్రి హుందాగా వ్యవహరించాలి: జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట(తాళ్లగడ్డ), న్యూస్‌టుడే:** మూసీ సుందరీకరణ, రాష్ట్ర అప్పులు, గ్రూప్-2 పరీక్షలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడటం సరికాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఆయన స్థాయిని దిగజార్చేలా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజల పరువు పోయేలా ఉపన్యాసాలు ఉన్నాయని, ఎవరో రాసిచ్చిన పాఠం చదవడం మానేస్తే మంచిదని ఎద్దేవా చేశారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి హుందాగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచింది కేసీఆర్ అని గుర్తు చేశారు. అప్పులు మంత్రుల జేబులోంచి చెల్లిస్తున్నట్లు అతితెలివిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ కూడబెట్టిన ఆదాయం నిలబెడితే చాలన్న ఆలోచనలో ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. నూతనంగా కట్టాల్సిన అవసరం లేదని.. ఉన్నవి కూల్చకుండా ఉంటే చాలని తెలిపారు. మూసీ కూల్చివేతల తర్వాత సీఎం తన భద్రత పెంచుకొని ప్రగల్భాలు పలుకుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్ అశోక్ నగర్‌లోని నిరుద్యోగులతోనే రేవంత్‌రెడ్డికి అధికారం వచ్చిందని, అక్కడ పోలీసుల నిర్బంధం ఎందుకని ప్రశ్నించారు. నిరుద్యోగులను నిర్బంధించడం మానుకొని వారి అనుమానాలు నివృత్తి చేయాలని కోరారు.

**ఏడాదిలోపే ప్రజల్లో తిరుగుబాటు మొదలు... సూర్యాపేట (తాళ్లగడ్డ):** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలన పూర్తిగా విఫలమైందని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మండల నాయకులకు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. భారాస నేతలు నిత్యం ప్రజల్లో ఉండాలని, సమస్యలపై పోరాడాలని సూచించారు. అధికారం కట్టబెట్టిన ఏడాదిలోపే ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని పేర్కొన్నారు.





## పిడుగుపాటుకు 39 గొర్రెలు, మేకలు మృతి

**నేరేడుచర్ల, న్యూస్‌టుడే:** మండలంలోని బోడల్‌దిన్న గ్రామంలోని వైకుంఠధామం సమీపంలో చెట్ల వద్ద శుక్రవారం పిడుగు పడి మల్లె పూల లింగయ్య, యాల కాని ఆంజనేయులుకు చెందిన 39 గొర్రెలు, మేకలు మృతిచెందాయి. చిల్లేపల్లి-సోమారం రోడ్డు పక్కన మేస్తున్న జీవాలు వర్షం పడడంతో చెట్లకిందకు వెళ్లిన సమయంలో పిడుగు పడింది. గొర్రెల కాపరులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. రూ.ఐదారు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.



నేరేడుచర్ల: బోడల్‌దిన్న వైకుంఠధామం సమీపంలో పిడుగుపడి మృతిచెందిన గొర్రెలు, మేకలు

# సమగ్ర కుల గణనకు సన్నాహాలు

**నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సమగ్ర సామాజికవర్గ(కుల) గణనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితో పాటు సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అంచనాకు వచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



**అన్నింటికీ అవసరమే..**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కుల గణనకు హామీ ఇచ్చింది. ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అభ్యంతరాలు వస్తున్నాయి. ప్రధానంగా బీసీ గణన చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. గతంతో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. కుల గణన చేస్తే పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. త్వరలో నిర్వహించే సర్పంచి, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు ఇది ప్రామాణికం కానుంది.

**సిబ్బంది నియామకానికి కసరత్తు**

ఇంటింటి సర్వే చేసేందుకు సిబ్బంది (ఎన్యుమరేటర్లు) ఎంత మంది అవసరమో అంచనా వేస్తున్నారు. 60 రోజుల్లో గణన పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల్లో పనిచేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే ఎన్యుమరేటర్ల నియామకం పూర్తి చేయనున్నట్లు ప్రణాళిక అధికారులు పేర్కొంటున్నారు.

**బీసీలను లెక్కించలేదు**

ప్రతి పదేళ్లకోసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు ఇతర సందర్భాల్లో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల గణన చేపట్టలేదు. ఇది బీసీ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. 2011 జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా గుర్తించారు. బీసీల గణాంకాలు బయట పెట్టలేదు. నాటి నుంచి బీసీ సంఘాల నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉన్నత న్యాయస్థానం సైతం బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# గమ్మత్తులో యువత..!



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024లో మిషన్ పరివర్తన్ కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చిన వారి సంఖ్య: 327



ఇందులో గంజాయి తాగటం మానేసిన వారి సంఖ్య: 321

డీఅడిక్షన్ కేంద్రంలో ఉన్నవారి సంఖ్య: 6

**మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రజల ధన, మాన, ప్రాణాలను కబళించే కర్కశులను నియంత్రిస్తూ.. జనజీవన భద్రతను కాపాడాల్సిన బాధ్యత, పోలీసులు, అధికారులపై ఉన్నదన్నది ఎంత సత్యమో.. అదే సమయంలో వారి పిల్లల ప్రవర్తనను, పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందనే విషయాన్ని గ్రహించాలి. అప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని ప్రముఖులు, నిపుణులు అవగాహన కల్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో లోపం కనిపిస్తోందని చెప్పొచ్చు.

☛ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గంజాయి చాపకింద నీరులా విస్తరిస్తోంది. దాని వాడకం యువతతో పాటు మైనర్లకు పాకుతోంది. దీనికి అలవాటు పడి కొందరు యువకులు, మైనర్లు ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. సరిహద్దు, కృష్ణపట్టె పరివాహక ప్రాంతం నుంచి గ్రామాలకు, పట్టణాలకు విస్తృతంగా సరఫరా అవుతోంది. పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ పూర్తిగా నిరోధించలేకపోతున్నారు. గంజాయి వాడకాన్ని తగ్గించాలంటే తమతోపాటు(పోలీసులు) తల్లిదండ్రుల పాత్ర కీలకమని వారు చెబుతున్నారు.

### మచ్చుకు కొన్ని ఘటనలు..

☛ మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదివే బాలుడు వాళ్ల తరగతి ఉపాధ్యాయురాలితో 'నా మిత్రుడి ఇంట్లో గంజాయి ఉంది.. నన్ను రమ్మని పిలుస్తున్నాడు' అని చెప్పటంతో ఆ ఉపాధ్యాయురాలికి నోట మాట రాలేదు.

☛ రెండు నెలల క్రితం పట్టణంలోని రవీందర్‌నగర్‌లో పని చేసే ఓ మైనర్ వింత ప్రవర్తనతో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేశాడు. మైనర్ ఆగడాలను తట్టుకోలేక.. ఆ తండ్రి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ మైనర్‌ను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులకు, ఆత్మహత్య చేసుకుంటానని చాకుతో చేతిని కోసుకుని దగ్గరకు రాకుండా బెదిరించాడు. దీంతో మైనర్‌ను పోలీసులు పట్టుకుని వైద్య పరీక్షలు నిర్వహించగా.. గంజాయి తీసుకున్నట్లు తేలటంతో డీఅడిక్షన్ కేంద్రానికి పంపారు.


☛ సూర్యాపేట జిల్లా కేంద్రంలో గంజాయి మత్తులో కొందరు, ఓ యువకుడిని చావగొడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరలైంది. ఇలాంటి వెలుగులోకి రాని ఘటనలు కోకొల్లలు.

### విచక్షణాజ్ఞానం కోల్పోతారు..

**డాక్టరు మొయినుద్దీన్, మండల వైద్యాధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మిర్యాలగూడ**



గంజాయికి అలవాటు పడితే వారిలో ఏకాగ్రత లోపిస్తుంది. రెండు, మూడేళ్లుగా వరుసగా తీసుకుంటే విచక్షణాజ్ఞానం కోల్పోతారు.. నైరాశ్యం లక్షణాలు వస్తుంటాయి.








అవగాహన కల్పిస్తున్న రెండో పట్టణ వలయాధికారి నాగార్జున

### అవగాహన కల్పిస్తున్నాం.. వీరబాబు, సీఐ, మిర్యాలగూడ గ్రామీణం

ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ప్రజలకు, అనుమానం వచ్చిన పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్సైజ్‌శాఖ నిఘా బృందాలతో తనిఖీ చేస్తున్నాం. ప్రజలంతా సహకరిస్తే వాడకాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం.

# అతడు.. నిజంగా వీరుడే..!



వీరబాబు

**కోదాడ, న్యూస్‌టుడే:** చదువుకున్న యువకుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించాడంటే అతడి వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుంది. అంతకు మించితే 40 లోపు ఉద్యోగం సాధిస్తుంటారు. అదే 40 దాటి ఉద్యోగం సాధిస్తే ఆశ్చర్య పడాల్సిందే. ఏకంగా 47 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు కోదాడకు చెందిన గూటి వీరబాబు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో సోషల్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి ఔరా అనిపించారు.

### పది తప్పి.. పశువులు మేపి..

పదో తరగతి ఫెయిల్ కావడంతో ఏడాది పాటు పశువులు, మేకలు మేపారు. ఇంటర్ అతి కష్టం మీద పాసయ్యాడు. అనంతరం డిగ్రీ, బీఈడీ చదివారు. అనంతరం వివాహం, ఇద్దరు పిల్లలతో జీవనం గడపడం కష్టంగా మారింది. ఫొటోగ్రాఫర్‌గా పని చేసినా.. ప్రయోజనం లేదని తెలుసుకున్నాడు. ప్రభుత్వ కొలువు సాధిస్తేనే ఆ చదువుకు సార్థకత ఉంటుందని నమ్మి సాధన చేయడం మొదలుపెట్టారు.

★ గత 20 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడుతున్నారు. డీఎస్సీ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, గ్రూప్ ఉద్యోగాలు, రైల్వే, హాస్టల్ వార్డెన్ ఇలా 23 ఉద్యోగ పరీక్షలు రాశాడు. ఓ డీఎస్సీలో ఒక్క మార్కుతో ఉద్యోగం కోల్పోయారు. తాజా నోటిఫికేషన్‌లో ఏకంగా 4వ ర్యాంకు సాధించి ఆశ్చర్యపరిచారు. ఒక పూట ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ, మరో పూట పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయానికి వెళ్లి చదువును కొనసాగించారు. వయసు మీరినా ఉద్యోగం సాధించడంతో అందరికీ ఆదర్శంగా మారారు.

★ సరైనా ఉద్యోగం లేక, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో గత పదేళ్లుగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడ్డానని వీరబాబు తెలిపారు. సోదరుడు 2006లోనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడంతో ప్రభుత్వ ఉద్యోగంపై మక్కువ పెరిగిందని, తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యుల సహకారంతో ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు.

★ వీరబాబు స్వగ్రామం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి అయినప్పటికీ గత 20 ఏళ్లుగా కోదాడ పట్టణంలో నివసిస్తున్నారు. పండగలకు స్వగ్రామానికి వెళితే ఏం చేస్తున్నావని, పదో తరగతి ఫెయిల్ అయిన వాడికి ఉద్యోగం ఎలా వస్తుందని, ఇంకా చదువు ఏంటనీ బంధువులు, స్నేహితులు హేళన చేసేవారని ఆయన చెప్పారు. దీంతో గ్రామానికి వెళ్లడం కూడా మానేశానని వివరించారు. ఇంటి అద్దె, పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సి వచ్చేదని, కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతోనే ఉద్యోగ కల నెరవేరిందన్నారు. గతంలో మాట్లాడటానికే చులకనగా చూసిన బంధువులు, స్నేహితులు ఇప్పుడు ఫోన్లు చేసి అభినందించడం ఆనందంగా ఉందని తెలిపారు.

# పాత వీసీకే.. పట్టం



ప్రొ.అల్తాఫ్ హుస్సేన్

**నల్గొండ టౌన్, న్యూస్‌టుడే:** మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నూతన వీసీగా ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో 2016 నుంచి 2019 వరకు ఇదే వర్సిటీకి వీసీగా పనిచేశారు. వర్సిటీలో రెండు పర్యాయాలు స్నాతకోత్సవం నిర్వహించిన ఘనత సైతం ఈయనకే దక్కింది. వర్సిటీకి ఇప్పటి వరకు ప్రొ.గంగాధర్, ప్రొ.కట్టా నర్సింహారెడ్డి, ప్రొ.అల్తాఫ్ హుస్సేన్, ప్రొ.గోపాల్‌రెడ్డి రెగ్యులర్ వీసీలుగా పని చేశారు. ఎంజీయూ వీసీ పోస్టు కోసం ఎంతో మంది ఆశావహులు పోటీ పడ్డా.. చివరికి అల్తాఫ్ హుస్సేన్‌కే పదవి వరించింది. ఐదో వీసీగా ఈయన త్వరలోనే పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. వర్సిటీకి నూతన వీసీ రానున్న నేపథ్యంలో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారంతో పాటుగా వర్సిటీలో అభివృద్ధి మరింత వేగం అవుతుందని భావిస్తున్నారు. నూతన వీసీకి ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ టూ వీసీ కె.అంజిరెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.




జలబంధం..

# గడ్డిపూల అందం

హాలియా వద్ద ప్రవహిస్తున్న వరద కాలువలో గడ్డి ఏపుగా పెరిగింది. అది కాలువ మొత్తం విస్తరించింది.. పైగా తెల్లటి గడ్డిపూలతో దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది.. ఈ గడ్డి మధ్యలో నుంచే నీటి ప్రవాహం సాగుతోంది.

- ఈనాడు, నల్గొండ



శిక్షణ పొందుతున్న యువత (పాతచిత్రం)

# ఉపాధికి శిక్షణ..

**భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ బాటలు వేస్తూ వారిలో కొత్త వెలుగులు నింపుతోంది మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థ. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదవలేక, చదివిన చదువుకు ఉపాధి, ఉద్యోగాలు లేక నిరాశతో నిరుద్యోగులుగా మారిన యువతకు ఉపాధి మార్గం వేస్తోంది. స్వల్పకాలిక కోర్సులతో ఉపాధి అవకాశాలున్న కంప్యూటర్, ఎలక్ట్రీషియన్, సోలార్, టైలరింగ్, సెల్‌ఫోన్ మరమ్మతులు, ద్విచక్ర వాహనాల మరమ్మతులు వంటి పలు కోర్సుల్లో వసతి కల్పించి శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ అనంతరం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తూ కచ్చితమైన ఉద్యోగ అవకాశాలను సంస్థ కల్పిస్తోంది. ఇటీవల ద్విచక్ర వాహన మరమ్మతు కోర్సులో శిక్షణ పూర్తిచేసుకొని ఉద్యోగాలు చేస్తున్న యువత అభిప్రాయాలు వారి మాటల్లోనే.

### సంస్థ ఉపాధి మార్గం చూపించింది

**- ప్రణీత్, మెదక్**



నేను డిప్లొమా మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాను. చదువుకు తగ్గట్టుగా సరైన ఉద్యోగం లభించలేదు. స్నేహితుల ద్వారా సంస్థ గురించి తెలుసుకున్నాను. ఆటోమొబైల్ మరమ్మతు కోర్సులో ప్రవేశం పొందాను. శిక్షణ అనంతరం సికింద్రాబాద్‌లోని రాం హోండా మోటర్స్‌లో ఉద్యోగం సాధించాను. నెలకు రూ. 14 వేల వేతనం పొందుతున్నాను.

### ఉగ్యోగానికి తగ్గట్టుగా..



**- నగేష్, వనపర్తి**

నేను ఇంటర్ చదివాను. సంస్థలో స్వల్పకాలిక కోర్సులైనా ఉద్యోగానికి తగ్గట్టుగా అవసరమైన అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. ద్విచక్ర వాహన మరమ్మతు కోర్సులో శిక్షణ పొందాను. సంస్థ చేపట్టిన ప్రాంగణ ఎంపికల్లో సుశీల్ టీవీఎస్ కూకట్‌పల్లిలో టెక్నీషియన్‌గా ఉద్యోగం సంపాదించాను. నెలకు రూ.13వేల వేతనం పొందుతున్నాను.

### కచ్చితమైన ఉపాధి అందించడమే లక్ష్యం

**- అయోధ్య, శిక్షకుడు ఎస్ఆర్‌టీఆర్ఐ**



ఉన్నత చదువులు చదువుకోలేక పోయిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలున్న కోర్సుల్లో శిక్షణ అందించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే సంస్థ లక్ష్యం. నిరుద్యోగ యువత ఖాళీగా సమయాన్ని వృథా చేయకుండా సంస్థ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలి.



కళావేదికపై నృత్య ప్రదర్శన

# కళా వేదికపై కూచిపూడి నాట్యం

**యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే:** యాదాద్రి పుణ్యక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం నృత్య ప్రదర్శన జరిగింది. ఆధ్యాత్మిక ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే ఉద్దేశంతో దేవస్థానం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో హైదరాబాద్, హన్మకొండలకు చెందిన అర్చన నృత్యనికేతన్, హంపీ కళా నిలయం బృందాలు వేర్వేరుగా కూచిపూడి నాట్య ప్రదర్శనలు జరిగాయి.

# వసూలు చేసి.. వదిలేసి..!

**నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** పంచాయతీల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలపై సందిగ్ధత ఏర్పడింది. వీటి నిర్మాణాల కోసం నాలుగున్నరేళ్ల క్రితం ఒక్కో పంచాయతీ నుంచి రూ.20 వేలు డీడీలు తీసుకున్నారు. ఇప్పటి వరకు డబ్బులు తిరిగి ఇవ్వలేదు. సామూహిక మరుగుదొడ్లను మంజూరు చేస్తామని గతేడాది కేంద్రం ప్రకటించింది. దీంతో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు ఆ డబ్బులను తిరిగి చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం మరుగుదొడ్లను మంజూరు చేస్తుందా లేక పంచాయతీలకు డబ్బులు తిరిగి చెల్లిస్తుందా అనేది సందిగ్ధంగా మారింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రతి గ్రామంలో సామూహిక మరుగుదొడ్డి నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలు వాటాగా పదిశాతం చెల్లించాలని సూచించారు. 1740 పంచాయతీలు రూ.3.48 కోట్లు చెక్కులు, డీడీలు చెల్లించాయి. కొన్ని పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించి మధ్యలో నిలిపివేశారు.

**పంచాయతీలు చెల్లించిన డబ్బులు (రూ.లలో)**

| జిల్లా | పంచాయతీలు | చెల్లించిన డబ్బులు |
|---|---|---|
| నల్గొండ | 844 | 1.68 కోట్లు |
| సూర్యాపేట | 475 | 95 లక్షలు |
| యాదాద్రి | 421 | 84.20 లక్షలు |

**పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఉపయోగకరం...** పంచాయతీలు కట్టిన డబ్బులు గ్రామీణ అభివృద్ధి శాఖ వద్ద నాలుగున్నరేళ్లుగా ఉంటున్నాయి. ప్రస్తుతం పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో పంచాయతీలకు తిరిగి డబ్బులు చెల్లిస్తే పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఉపయోగపడుతాయి. సామూహిక మరుగుదొడ్ల పథకం ఇంకా ముగియలేదు. కేంద్రం మంజూరు చేస్తే వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తామని డీఆర్‌డీవో అధికారులు పేర్కొంటున్నారు.

# నేర సంస్కృతికి విరుగుడు పుస్తక పఠనమే

**కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:** నేర సంస్కృతికి విరుగుడు, సమాజం సమతౌల్యతను సాధించడానికి పుస్తక పఠనమే శక్తివంతమైందని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) పల్లె నాగేశ్వరరావు సూచించారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో శుక్రవారం ప్రముఖ కవి, రచయిత జూలూరు గౌరీశంకర్ రచించిన ఆత్మకథనాత్మక దీర్ఘ కావ్యం 'జూలూరు పథం' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 94 గ్రంథాలయాలకు ఈ గ్రంథాన్ని బహూకరించే కార్యక్రమం కోదాడలో ప్రారంభించినట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాణోతు బాలమ్మకు ఈ కావ్యం 200 గ్రంథాలను నాగేశ్వరరావు అందించి మాట్లాడారు. సమాజం విద్వేషాల నుంచి బైటపడి శాంతి వైపు పయనించాలంటే పుస్తకమే పదునైనా ఆయుధమన్నారు.



కోదాడలో 'జూలూరు పథం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు, నాయకులు

★ కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ మాట్లాడుతూ.. నడిగూడెం జమీందార్ నాయిన వెంకటరంగారావు 120 గ్రంథాలయాలను స్థాపించి, 60 గ్రంథాలను ముద్రించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. అదే మండలం నుంచి వచ్చిన జూలూరు ఉద్యమ సాహిత్యాన్ని వెలువరించారని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, చిన్ని, పార సీతయ్య, సీహెచ్.లక్ష్మీనారాయణ రెడ్డి, పాండురంగారావు, బంగారు నాగమణి, ఎస్ఆర్‌కేమూర్తి, దేవబత్తిని నాగార్జున, నాగిరెడ్డి, నాగేశ్వరరావు, రాంబాబు, శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు, రచయిత, కవులు పాల్గొన్నారు.

# బీమా కంపెనీకి వినియోగదారుల కమిషన్ మొట్టికాయ

**నల్గొండ లీగల్, న్యూస్‌టుడే:** నామినీకి బీమా పాలసీ డబ్బులను చెల్లించడానికి తిరస్కరించిన ఓ బీమా సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయ వేసింది. పాలసీలో నామినీగా ఉన్న మృతుని కుమార్తెకు బీమా మొత్తాన్ని చెల్లించాలని శుక్రవారం ఆదేశాలను జారీ చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బీసీ కాలనీకి చెందిన వక్కంటి తిరుపతయ్య నల్గొండ జిల్లా కేంద్రానికి చెందిన ఓ బీమా సంస్థలో రూ.31,48,399లకు 36 నెలల కాలానికి పాలసీ తీసుకున్నారు. నామినీగా అతని కుమార్తె వక్కంటి రాజాచంద్రను నమోదు చేశాడు. 2021 మే 7న అనారోగ్యంతో తిరుపతయ్య మరణించారు. ఆయన ఇతర వ్యాధులతో ఉండి పాలసీలో చేరాడని.. డబ్బులు చెల్లించలేమని నామినీకి తెలిపారు. దీంతో బాధితురాలు వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న కమిషన్ అధ్యక్షుడు మామిడి క్రిస్టోఫర్, సభ్యులు యస్.సంధ్యారాణి, కె.వెంకటేశ్వర్లు శుక్రవారం తుది తీర్పును వెలవరించారు. బాధితురాలికి మొత్తం రూ.31,48,399లను 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించారు. సదరు మొత్తంతో పాటు ఫిర్యాదురాలిని మానసిక వేదనకు గురి చేసినందున నష్టపరిహారంగా రూ.లక్షను చెల్లించాలని, కేసు ఖర్చులు రూ.పదివేలను నేటి నుంచి 45 రోజుల్లో చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫాంరేటు | 120-00 |
| రిటైల్ | 142-00 |
| డ్రెస్డ్ | 206-00 |
| స్కిన్‌లెస్ | 234-00 |

# గాలికుంటు నివారణకు టీకాలు

**నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:**



గాలికుంటువ్యాధి నివారణకు పశువులకు టీకా వేయడం ప్రారంభించారు. టీకా కార్యక్రమం వచ్చే నెల 14 వరకు సాగుతుంది. నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో మూడు నెలల పైబడిన పశువులకు టీకాలు వేస్తారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాల్లోని పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి క్రిములు గాలితో ప్రయాణించి ఇతర పశువులకు సోకే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న ఎఫ్ఎండీ ప్రోగ్రామ్ కింద ఈ టీకాను ప్రతి ఆరు నెలలకు ఒక సారి వేసి, రాబోయే నాలుగేళ్లలో గాలికుంటు వ్యాధిని పూర్తిగా నివారించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.


★ ఉమ్మడి జిల్లాలో 539406 పశువులు ఉన్నాయి. టీకాలు వేసిన పశువులకు గుర్తుగా కొమ్ములకు ఆకుపచ్చ రంగు వేస్తారు.

ఉదయం వేళ చల్లటి సమయంలోనే టీకాలు వేసే కార్యక్రమం చేపడుతారు. అధికారులు గ్రామాలకు వెళ్లే ముందు రోజు పల్లెల్లో టాం టాం వేయించి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పశువైద్యులు, సిబ్బంది ప్రతి రైతు వద్దకు వెళ్లాల్సి ఉంది. అందుబాటులో రైతులు లేకపోతే మరో 10 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు.

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి:

**జూలకంటి వెంకటరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి, నల్గొండ**

అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగిస్తాం. గ్రామాల్లో పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.




# విద్యుత్తు టర్బైన్‌ను పరిశీలించిన జపాన్ నిపుణులు

**నాగార్జునసాగర్, న్యూస్‌టుడే:** నాగార్జునసాగర్ ప్రధాన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలోని టర్బైన్‌ను జపాన్‌కు చెందిన నిపుణులు పరిశీలించారు. సాగర్ ప్రధాన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలోని రెండో నంబరు యూనిట్ గతేడాది మరమ్మతులకు గురి కాగా.. జెన్‌కో అధికారులు మరమ్మతులు చేయడానికి పలుమార్లు ప్రయత్నం చేశారు. అది సఫలం కాకపోవడంతో ఆ యూనిట్‌లో విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇటీవల జెన్‌కో సీఎండీ సాగర్ విద్యుత్తు కేంద్రాలను సందర్శించి మరమ్మతులు చేయించడానికి తగిన చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో జెన్‌కో అధికారులు జపాన్‌కు చెందిన టర్బైన్ మరమ్మతుల నిపుణులను పిలిపించారు. శుక్రవారం విద్యుతేంద్రంలో మరమ్మతులకు గురైన యూనిట్‌ను వారు పరిశీలించారు. వెంటనే మరమ్మతులను ప్రారంభిస్తారని జెన్‌కో అధికారులు తెలిపారు.



కూరగాయల మేలెంచి..

# పండ్లతోటలను తొలగించి

కూరగాయల ధరలు ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్నాయి. హైదరాబాద్ నగరంలో కొన్ని పేరున్న మాల్స్ వారు నేరుగా రైతుల వద్దకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి నగర వాసులకు విక్రయిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు రైతులు కూరగాయల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. నగర శివారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జూలూరు గ్రామానికి చెందిన కౌలు రైతు అంజయ్య ఏళ్లుగా పండిస్తున్న సపోటా తోటను తొలగించి నాలుగు ఎకరాల్లో అయిదారు రకాల కూరగాయలు పండిస్తున్నారు. టమాటా, దోస, మిర్చి, కాకర, బీర, బెండలను డ్రిప్ సాయంతో తక్కువ ఖర్చుతో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం టమాటా ధర అధికంగా ఉండటంతో ఎక్కువ సాగు చేస్తున్నారు. పండ్ల తోటతో పోలిస్తే కూరగాయల సాగు లాభదాయకంగా ఉందని రైతు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, బీబీనగర్

# కోదాడ

●కోదాడ ●హుజూర్‌నగర్

## బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి కర్ల ప్రేమానంద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యంతో చర్చలు జరిపి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈనెల 21న జరిగే ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మునగాల: ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని బీఎస్ఎఫ్ఐ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి నాగబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేకుంటా బీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసనలు తప్పవన్నారు.

5న అవిశ్వాసం.. గరిడేపల్లి: రాజీవ్‌నగర్ సహకార పరపతి సంఘ ఛైర్మన్‌పై నవంబర్ 5న అవిశ్వాసం పెట్టేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి పద్మ సభ్యులకు లేఖలు పంపారు. ఈనెల 14న తొమ్మిది మంది సభ్యులు డీసీవోకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈమేరకు అధికారులు సమావేశం ఏర్పాటుచేశారు.



గరిడేపల్లి, న్యూస్‌టుడే:

? గడ్డిపల్లిలో సూర్యాపేట రోడ్డుపైకి కంపచెట్లు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనం తప్పించడానికి పక్కకు వెళ్తే కళ్లకు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి.
– వి.రమేష్, గరిడేపల్లి

✔ సిబ్బందిని పంపించి వార్షిక నిర్వహణ నిధులతో తొలగిస్తాం.
– ఏఈ శివకుమార్, ఆర్అండ్‌బీ

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే:

? మండల పరిధిలోని దోరకుంటలో 12వార్డు నెమలిపురి కాలనీలో మురుగు కాలువ మీద చెట్లు పెరిగాయి. దీంతో పై నుంచి వచ్చే మురుగు నీరు పారకపోవడంతో అక్కడే నిలిచి రోగాలు బారిన పడుతున్నారు. ఇళ్ల ముందు నిల్వ ఉన్న మురుగులో దోమలు, ఈగలు పెరిగి అనారోగ్యానికి గురవుతున్నాం.
– ఎం సత్యనారాయణ, నెమలిపురి కాలనీ

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. రెండు రోజుల్లో ప్రొక్లెయిన్ సాయంతో తొలగిస్తాం.
– వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి

## సైబర్ నేరాలపై అవగాహన

మోతె, న్యూస్‌టుడే: ఆశ చూపుతూ చరవాణులకు వచ్చే సంక్షిప్త సందేశాలను నమ్మి ఆర్థికంగా మోసపోవద్దని ఎస్సై యాదవేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నామవరం గ్రామంలో శుక్రవారం డ్రగ్స్, సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేస్తూ ఏర్పాటు చేసిన కళాజాత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీను, పీసీలు కోటయ్య, రాంరెడ్డి, కళాజాత బృందం సభ్యులు యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



మోతె: నామవరంలో కళాజాత బృందంతో అవగాహన కల్పిస్తున్న ఎస్సై యాదవేందర్‌రెడ్డి

## దివ్యాంగుల బస్‌పాస్ మేళా

కోదాడ పట్టణం: హుజూర్‌నగర్ నియోజకవర్గ దివ్యాంగుల బస్‌పాస్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్‌లోని కళ్యాణ్‌పురం రోడ్‌లో ఈనెల 21, 22 తేదీల్లో, 28న మఠంపల్లి, 25 మేళ్లచెర్వు, 28న చింతలపాలెంలో దివ్యాంగుల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా మఠంపల్లి, మేళ్లచెర్వుగూడెం, యాతవాకిళ్ల, మైహోం సిమెంట్స్, డక్కన్ సిమెంట్స్ నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నిత్యావసర ధరలను నియంత్రించాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాంబాబు, కోశాధికారి కోటగిరి వెంకటనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎం.ముత్యాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు



తేజ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ సోమిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాల్



కోదాడ: తేజ విద్యాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జయ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ చలువేరు వేణు



## వ్యాసరచన.. నైపుణ్యాల వెలికితీత

'ఈనాడు' ఆధ్వర్యంలో కోదాడ తేజ విద్యాలయం విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం, విద్యార్థుల్లో సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో జి.అస్మిక ప్రథమ, ఎ.క్షత్రజ్ఞ ద్వితీయ, భవజ్ఞ తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. నైపుణ్యాల వెలికితీత కోసమే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రమా, డైరెక్టర్ వి.సోమిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాల్‌లు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

◆ 'ఈనాడు' ఆధ్వర్యంలో కోదాడ జయ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం, విద్యార్థుల్లో సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎ.వేద ప్రథమ, బి.అక్షయ ద్వితీయ, లిఖితప్రియ తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ చలువేరు వేణు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. –కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:



కోదాడ: జయ పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## అమరుల ఆశయాలు సాధిద్దాం: జూలకంటి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: అమరవీరుల ఆశయాలను సాధించేందుకు అందరం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు పాశం నర్సయ్య(73) శుక్రవారం మృతిచెందారు. ఆయన అంతిమయాత్రలో పాల్గొని అనంతరం జరిగిన సంతాప కార్యక్రమంలో జూలకంటి మాట్లాడారు. నర్సయ్య జీవితాంతం పార్టీ కోసం తపనపడ్డారని, ఆయన ఎంపీటీసీగా పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగార్జున పాండు, శీలం రావు, వెంకటరెడ్డి, ప్రకాష్, బ్రహ్మం, సైదులు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



వివిధ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన ముగ్గురు విద్యార్థులతో సలీంషరీఫ్, ఉపాధ్యాయులు

## 'కళా' పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో కోదాడ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో సలీంషరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు పి.అక్షయ్ మ్యూజికల్ పోటీల్లో, విజువల్ ఆర్ట్స్ కేటగిరిలో 9వ తరగతి.... ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో పి.హరీష్‌కుమార్‌లు ఎంపికయ్యారు. నవంబరు 1, 2 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఇదే స్ఫూర్తితో ప్రదర్శించి నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

**సౌత్‌జోనల్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు..**

కోదాడ పట్టణం: ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో జరిగే సౌత్ జోనల్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డి.శ్రవణ్‌కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు.. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో 60 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో తమ కళాశాలకు చెందిన శ్రవణ్‌కుమార్ ఎంపిక కావటం.. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కాగా ఈనెల 24 నుంచి 27 వరకు చెన్నైలో జరిగే యూనివర్సిటీ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. పీడీ ప్రసాద్, అధ్యాపకులు సైదిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీలత, ఎన్.నిర్మలకుమారి, వి.వి.రెడ్డి అభినందించారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నేరేడుచర్ల: పాలకవీడు జడ్పీహెచ్ఎస్‌లో సుదీర్ఘకాలం పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు ఎం.బాలు, వై.రామానుజన్, కె.వెంకటరెడ్డి, శ్రీనివాస్, రాములను శుక్రవారం పాఠశాలలో మండల విద్యాధికారి ఇంజమూరి కాటయ్య సన్మానించారు. అంకితభావంతో పనిచేసినపుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నేరేడుచర్ల ఎంఈవో పి.సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల: పాలకవీడు జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈవో కాటయ్య, తదితరులు



హుజూర్‌నగర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. హుజూర్‌నగర్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ ఛైర్మన్ జక్కుల నరేందర్, ఫూర సంఘం వైస్‌ఛైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, తహసీల్దార్ నాగేందర్, డీటీ రాజశేఖర్, పీఏసీఎస్ సీఈవో నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గరిడేపల్లి: గడ్డిపల్లి రైతుసేవా సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ బండ కవిత శుక్రవారం ప్రారంభించారు. వ్యవసాయాధికారి ప్రీతమ్ కుమార్, సహకార శాఖ అధికారులు, సీఈవో సైదులు, సంఘ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మునగాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లుచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆర్డీవో, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీనదయాళ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: ప్రభుత్వం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి రూ.500 బోనస్ పొందాలని పీఏసీఎస్ ఛైర్మన్ పూలే రాధాకృష్ణారావు అన్నారు. వేపలసింగారంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.

మఠంపల్లి: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో మఠంపల్లి, బక్కమంతులగూడెం, పెదవీడు గ్రామాల్లో మూడు కేంద్రాలు ప్రారంభించారు. డీసీఎస్‌వో రాజేశ్వర్, తహసీల్దార్ మంగ, డీటీ ఎస్ రామిరెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ రామచంద్రయ్య, సీఈవో తిరుపతయ్య, యల్లారెడ్డి పాల్గొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దారు ధ్రువకుమార్ ప్రారంభించారు. ఏవో శ్రీధర్, ఏపీఎం నర్సయ్య, ఆర్ఐలు శ్వేత, సీతయ్య, ఏఈవో శిరీష, ఐకేపీ సీసీలు గురుమూర్తి, సర్వరాజ, కోటేశ్వరి పాల్గొన్నారు.

✦ బేతవోలు ప్యాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం ఛైర్మన్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు.



కోదాడ గ్రామీణం: గుడిబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లత

## ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రచారం



మోతె: నామవరం ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు

మోతె, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి పి.శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, నరేష్ కోరారు. మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని పలు పాఠశాలల్లో ఓటరు నమోదు, ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎల్ఎన్ చారి, రాంరెడ్డి, యాదగిరి, మధుసూదన్‌రెడ్డి, దయాకర్, శ్రీను, సురేష్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

చిలుకూరు: మండలంలోని కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ సభ్యత్వ నమోదుపై ప్రచారం నిర్వహించి, పత్రాలను ఎస్టీయూ సంఘం నాయకులు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కుక్కల నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి లింగయ్య గౌడ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ప్రచారం.. చిలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీపై పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, శీగల నరేష్ మాట్లాడారు.. పీఆర్‌టీయూ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. నాగేశ్వరరావు, సైదానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుపై పట్టణంలోని రామాపురం బీసీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి అవగాహన కల్పించారు. పీఆర్‌టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపల్ పి.శ్రీనివాసులు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్లు పాల్గొన్నారు.

గరిడేపల్లి: డీఎస్సీలో ఎంపికై కొత్తగా మండలానికి వచ్చిన ఉపాధ్యాయులను యూటీఎఫ్ సంఘ నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పొనుగోడు, రాయనిగూడెం, గడ్డిపల్లి, వెల్లంల, కల్మల్‌చెర్వు, కుతుబ్‌షాపురం, ఆదర్శ పాఠశాలల్లో చేరిన వారికి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. బాలస్వామి, నాగేశ్వరరావు, రవీందర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, శీగల నరేష్ అన్నారు. పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు అనూష, శ్రీనుకు సభ్యత్వం ఇచ్చారు.

## బాధ్యతల స్వీకరణ

చిలుకూరు, న్యూస్‌టుడే: మండల ట్రాన్స్‌కో ఏఈగా శీనయ్య, మండల సబ్ఇంజినీర్‌గా గుండు పరశురాములు విద్యుత్ ఉపకేంద్రంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. కోదాడ గ్రామీణం నుంచి బదిలీపై తాను, హుజూర్‌నగర్ పట్టణం నుంచి సబ్ఇంజినీర్ వచ్చినట్లు తెలిపారు. నూతన ఏఈని.. ఏఈ సైదయ్య లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, సిబ్బంది అభినందించారు.



చిలుకూరు మండల ట్రాన్స్‌కో నూతన ఏఈ శీనయ్యను అభినందిస్తున్న ఏఈ సైదయ్య, సిబ్బంది

నేరేడుచర్ల: పాలకవీడు మండల విద్యుత్తుశాఖ ఏఈగా పందిరి శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన నర్సింహానాయక్ కోదాడ డివిజన్‌కి బదిలీ అయ్యారు. పాలకవీడు లైన్‌మెన్‌గా పి.వెంకటేశ్వర్లు, బొత్తలపాలెం లైన్‌మెన్‌గా వెంకయ్య బాధ్యతలు చేపట్టారు. నాయుడు ఏడుకొండలు అభినందనలు తెలిపారు.

నడిగూడెం: మండల విద్యుత్తు ఏఈగా పనిచేస్తున్న ఎస్‌కే సైదా కోదాడ గ్రామీణ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిలుకూరు ఏఈగా పనిచేస్తున్న సైదయ్య నడిగూడెం ఏఈగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

## అన్నవరం దేవస్థానానికి వెండి శంఖం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానానికి ఓ భక్తుడు వెండి శంఖాన్ని శుక్రవారం కానుకగా అందించారు. తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన బి.వెంకటరామ నర్సయ్య దంపతులు 337 గ్రాముల వెండితో శంఖాన్ని తయారు చేయించారు. ఆలయానికి విచ్చేసి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ రాంబాబుకు అందించారు.

## డాక్టరేట్ ప్రదానం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని కోరుతూ రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం గౌరవ అధ్యక్షుడిగా, అమ్మ స్వచ్ఛంద సంస్థతో అనేక మందికి సాయమందించిన ఐఎస్‌డీఎస్ ప్రధాన కార్యదర్శి వీఎస్‌ఎన్ కృష్ణా నాగన్న గౌడ్‌కు డాక్టరేట్ లభించింది. గ్రేట్ మినిస్ట్రీస్ సంస్థ నాగన్న గౌడ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించి శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేసింది. ఐఎస్‌డీఎస్ నాయకుడిగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర వేదికల్లో కార్మికుల హక్కుల కోసం చేసిన కృషికి, వివిధ రంగాల ప్రజలకు అందించిన సేవలకు సంస్థ ఈ అవార్డును ప్రదానం చేసింది. ప్రస్తుతం రైల్వే బోర్డు జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా ఆయన పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనను అభినందించారు.

**సినిమాలు** కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, వెట్టయన్, శ్రీనివాస: దేవర, కాంప్లెక్స్: వెట్టయన్, విశ్వం, రంగా: వెట్టయన్, వెంకటేశ్వర: విశ్వం

## 60 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పాలకవీడు మండలం ఎల్లాపురం వద్ద రెండు ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపారు. గుడుగుంట్లపాలెం, మాచిఽఽ, ఎల్లారం గ్రామాల నుంచి బియ్యం సేకరించి శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని జిల్లా సత్యనారాయణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో మిర్యాలగూడకు చెందిన శ్రీను అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులకు సమాచారం అందించి వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**గుడిమల్కాపురంలో 30 క్వింటాళ్లు..**

చింతలపాలెం, న్యూస్‌టుడే: గుడిమల్కాపురం గ్రామంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం శుక్రవారం పట్టుబడింది. గ్రామంలోని పల్లె గోపి అనే వ్యక్తి ఇంటి వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు ఆటోలో లోడు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గ్రామంలో రేషన్ బియ్యం సేకరిస్తున్నారనే సమాచారం రావడంతో ఎస్సై అంతిరెడ్డి తన సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. ఆటోను స్వాధీనం చేసుకుని డ్రైవర్ ఖాసింపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇతనిని ఏపీలోని సీఆర్‌ఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్ మహ్మద్ పేటగా తెలిపారు.

## విద్యుత్ స్తంభం పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్ స్తంభంపైనుంచి పడి ఓ వ్యక్తి వెన్నుపూసకు బలమైన గాయాలైన ఘటన మండలంలోని కరక్కాయలగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వ్యవసాయ విద్యుత్ ఫీడర్ బ్రేక్‌డౌన్ కావటంతో రైతులు ఆ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. లైన్‌మెన్ ఆదేశాలతో గ్రామానికి చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ నామారపు అనిల్‌ను తీసుకెళ్లి కరెంటు సరఫరాను నిలిపివేయించి మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో స్తంభం నుంచి జారి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న విద్యుత్ అధికారులు స్థానికులతో కలిసి హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి వెన్నుపూసకు గాయాలయ్యాయని తెలుపగా.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

## అవీ ఇవీ

బోనస్‌పై విధి విధానాలు ప్రకటించాలి.. గరిడేపల్లి: సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నేటికి దానిపై విధి విధానాలు ప్రకటించకపోవడం అన్యాయమని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గానుగబండలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చేందుకు సిద్ధమైనా ప్రభుత్వం నేటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు.

జిల్లా కన్వీనర్‌గా శీనయ్య.. నేరేడుచర్ల: టీఎస్‌యూటీఎఫ్ మ్యాగజైన్ వాయిస్‌ఆఫ్ తెలంగాణ టీచర్ జిల్లా సబ్ కమిటీకి జిల్లా కన్వీనర్‌గా నేరేడుచర్ల మండల టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు ఆర్.శీనయ్య నియమితులైనట్లు శుక్రవారం సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన నియామకం పట్ల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



బాలింతలకు పండ్లు పంపిణీ.. కోదాడ: తెలంగాణ ఉద్యమకారుడు మామిడి రామారావు జన్మదిన వేడుకలను శుక్రవారం రామన్న యువసేన ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాహుల్, అఖిల్, నిఖిల్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

20న ఆత్మీయ సమ్మేళనం.. కోదాడ పట్టణం: పీడీ ఎస్‌యూ పూర్వ మిత్రుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 20న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు వేణు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎం.ఎస్. కళాశాల ఆవరణలో సమ్మేళన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సభకు ప్రొఫెసర్ ఖాసిం హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పీడీఎస్‌యూ పూర్వ ప్రస్తుత విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిరుద్యోగులపై లాఠీఛార్జి అమానుషం.. గరిడేపల్లి: న్యాయం కోరుతూ శాంతియుతంగా పోరాడుతున్న నిరుద్యోగులపై లాఠీఛార్జి చేయడం అమానుషమని భారాస నియోజకవర్గ నాయకులు రావెల నవీన్ కుమార్ అన్నారు. జీవో 29ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ విచారణకు స్వీకరించడం హర్షణీయమన్నారు. జగనన్న న్యాయమైన నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

దాతలు ఆర్థిక సాయమందించాలి.. మునగాల: ఇటీవల విద్యుత్ ప్రమాదంలో తీవ్ర గాయాలై ప్రాణాపాయస్థితిలో హైదరాబాద్‌లోని చికిత్స పొందుతున్న యువకుడికి చెందిన ఎల్.సైదులు వైద్యసేవల కోసం దాతలు ఆర్థికసాయం అందజేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంధం సైదులు కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైద్యానికి ఐదు నుంచి పది లక్షల ఖర్చవుతుందన్నారు.

మహా రుద్రాభిషేకానికి ఆహ్వానం.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 27న జరగనున్న మహా రుద్రాభిషేకాన్ని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు. పుర ఛైర్‌పర్సన్ గెల్లి అర్చనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాన్ని అందజేసి మాట్లాడారు. కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, విజయ్, సుధాకర్, ఆంజనేయస్వామి, ఆలయ ఛైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజ.. హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డ గ్రామంలో శ్రీఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాలస్వామి ఆలయంలో గోమాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ యరగాని గురవయ్య, ధర్మకర్తలు గంధం అంజయ్య, శివప్రసాద్, హరీష్, కవిత, నరసింహారావు, కృష్ణప్రసాద్, మంతరావు, ఆలయ ఈవో ఎంపీ లక్ష్మణ్‌రావు, హరీష్ కుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేలం పూర్తి.. కోదాడ: పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సారాయి కేసుల్లో పట్టుబడిన 36 టీవీఎస్, రెండు ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపారు. ఈ వేలంలో 12 మంది పాల్గొన్నారు, హుజూర్‌నగర్‌కు చెందిన గోపి అనే వ్యక్తి నాలుగు వాహనాలను రూ.28,000 దక్కించుకున్నట్లు తెలిపారు.

**బీసీ సబ్‌ప్లాన్ రూపొందించి నిధులివ్వాలి..** నేరేడుచర్ల: రాష్ట్రంలో బీసీ సబ్ ప్లాన్ రూపకల్పన చేసి నిధులివ్వాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దనుంజయనాయుడు శుక్రవారం డిమాండ్ చేశారు. ఈనెల 28న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత.. చిలుకూరు: మండలంలోని ఆచార్యులగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆలోచన ఫౌండేషన్ ఛైర్మన్ మొలుగురి రామారావు, పోర్ట్ ఫర్ ఫ్యూచర్ ఎన్జీవో ఛైర్మన్ కోదాడ డివిజన్ బాధ్యులు హెచ్‌సెల్ వెంకటయ్యతో పాటు పాఠశాల పూర్వ విద్యార్థులు ఐడీకార్డులు, డైరీ, బెల్టులు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, పాఠశాల ఛైర్మన్ నాగమణి, గ్రామపెద్దలు యలమందయ్య, వీరయ్య, వెంకటరామనర్సయ్య, లిక్కర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి సాయం.. మఠంపల్లి: హుజూర్‌నగర్-మట్టపల్లి బైపాస్ రహదారిపై ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలును కోల్పోయిన దుబ్బాక రాజు కుటుంబానికి సాయంగా వారి స్వగ్రామంలో రూ.5వేల నగదును అందజేశారు. హైకోర్టు న్యాయవాది డాక్టర్ బి.కృష్ణయ్య, ఎస్.కృష్ణ, ఎం.రవీందర్, దస్తగిరి, అబ్దుల్‌మజీద్, గవినాయక్ పాల్గొన్నారు.

అర్హతలున్న ఉత్సవాలకు తరలిరండి.. మఠంపల్లి: పీడీఎస్‌యూ ఆర్థశతాబ్ది ఉత్సవాలు ఈనెల 20న కోదాడలో, 24న హైదరాబాద్‌లో జరగనున్నాయని ఆ సంఘం పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి చందర్‌రావు కోరారు. శుక్రవారం శాలువతో ఆయన మాట్లాడారు. సంఘం ఆవిర్భవించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పి.రవి, వేణు, గౌతమ్, సతీష్, నాగరాజు, భీముడు, శ్రీను పాల్గొన్నారు.

# సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

## ప్రకృతి రక్షణకు ఆటాపాట

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు అన్నారు. రామన్నగూడెం గ్రామంలో శుక్రవారం సారథి కళాకారుల ఆధ్వర్యంలో ఆటాపాట కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యం, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలపై కళా ప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించారు. బృంద నాయకుడు ఈర్ల సైదులు, కళాకారులు మాగి శంకర్, గడ్డం ఉదయ్, మేడిపల్లి వేణు, శిరీష, స్రవంతి, రాధ, మంజూల, శ్రీకాంత్, ఉపేందర్ పాల్గొన్నారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని అంజనాపురి కాలనీలో మట్టి రోడ్లతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారడంతో రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. సీసీగా మార్చాలి. **– మమత, అంజనాపురి కాలనీ**

✔ నిధుల లభ్యతను బట్టి సీసీగా నిర్మిస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి కునుకు లేకుండా చేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – శ్రీను, జాకీర్‌హుస్సేన్‌నగర్

✔ దోమల మందు పిచికారీ చేయిస్తాం. – సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట.

## త్వరలో రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: రెండు పడక గదుల ఇళ్లల్లో 45 రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సూర్యాపేట మండలం కేసారంలోని ఇందిరమ్మ ఫేజ్ 2 రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. అన్ని గృహాలకు విద్యుత్తు, నీటి వసతి కల్పించాలని అధికారులకు సూచించారు. వాటర్ సంప్, సెప్టిక్ ట్యాంక్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.



**సూర్యాపేట: కేసారంలోని ఇందిరమ్మ ఫేజ్ 2 రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

### ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సూర్యాపేట (తాళ్లగడ్డ): విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మండలం తాళ్లఖమ్మంపహాడ్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. 7, 8, 10వ తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ పవన్‌కుమార్, ఆర్‌ఐ శ్రీధర్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రు, ఉపాధ్యాయులు స్వరూప రాణి, బీబీ నాంచారి, సంతోషిదేవి పాల్గొన్నారు.



ఒక వైపు సీసీ చేసి, మరో వైపు వదిలేసిన ఈ మురుగు కాల్వ తిరుమలగిరి పురపాలికలోని ముత్యాలమ్మ ఆలయం పరిధిలోనిది. ఇక్కడ కాల్వను అసంపూర్తిగా వదిలేయడంతో మురుగునీరు పక్కనే ఉన్న పొలాల మీదుగా పారుతోంది. దీంతో రైతులు పంటలు పండించలేక వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారు. ఈ కాల్వను తిర్నాయికుంట వరకు పొడిగించినట్లయితే మురుగు ముప్పు తప్పుతుంది.


## పట్టణం మురుగు.. పంటలకు చేటు

☛ వరద కాల్వ లేక వ్యవసాయం మానేస్తున్న రైతులు

తిరుమలగిరి పురపాలికలో పెద్దచెరువు కింద పంటలు సాగు చేసుకుంటున్న రైతులు మురుగు ముప్పుతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో మురుగు కాల్వల నిర్మాణం, అనుసంధానం సరిగా లేదు. ప్రజలు వాడుకున్న నీరంతా కాల్వల మీదుగా పొర్లి పొలాల్లోకి చేరుతోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. వ్యవసాయ భూముల్లో వర్షం, మురుగు నీరు నిల్వ ఉండటంతో సేద్యానికి వీలు కావడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి కొందరు రైతులు రూ.లక్షలు ఖర్చు చేసి మట్టి పోసి ఎత్తు పెంచుకొని సేద్యం చేసుకుంటున్నారు. మురుగు(వరద) కాల్వ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు తిర్నాయికుంట వరకు కాలువ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లయితే రైతులకు ఇబ్బందులు తప్పుతాయి. ఈ విషయమై పుర పాలిక ఇన్‌ఛార్జి కమిషనర్ ఎం.బుచ్చిబాబును వివరణ కోరగా.. అమృత్ 2.0లో భాగంగా మురుగుకాల్వల నిర్మాణం కోసం నిధులు వెచ్చించామని, పనులు పూర్తయిన తరువాత మిగిలిన నిధులతో వరదకాల్వ పూర్తి చేస్తామని తెలిపారు. **– తిరుమలగిరి, న్యూస్‌టుడే:**

### రూ 1.20 లక్షలు ఖర్చయినా పరిష్కారం కాలేదు

– కొంపెల్లి వీరసోములు, రైతు, తిరుమలగిరి



పెద్దచెరువు కింద నాలుగెకరాల పొలం ఉంది. మురుగు నీటి కారణంగా ఎకరం పొలం పాడైంది. సేద్యం చేయడానికి అనుకూలంగా లేకపోవడంతో గతేడాది రూ.1.20 లక్షలు వెచ్చించి మట్టి పోయించి సేద్యం చేస్తున్నాను. పెద్ద వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు.

### భూమి దిగబడుతోంది

– రహమాన్‌అలీ, రైతు



పట్టణంలోని వరదనీరంతా మా పొలం మీదుగా వెళ్తోంది. భూమి దిగబడుతూ సేద్యం చేయలేని పరిస్థితి నెలకొంది. ఐదేళ్లుగా పంటలు సాగు చేయడం లేదు. అనేకసార్లు ప్రజాప్రతినిధుల, పుర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలికంగా పనులు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో చేయడం లేదు. వరదకాల్వ నిర్మిస్తే సమస్య తీరుతుంది.



**ఐదేళ్లుగా సేద్యం చేయకుండా రైతు రహమాన్ అలీ వదిలేసినా వ్యవసాయ భూమి**

## 'పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం'

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ బలపర్చిన అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి అన్నారు. తిమ్మాపురం పాఠశాలలో శుక్రవారం పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉల్లెందుల సైదులు, జలగం పురుషోత్తం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఓటరు నమోదు పత్రాలు అందించి, ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కందుకూరి శివశంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.ఎల్లయ్య, చంద్రారెడ్డి, శంకర్, రమేష్, దయాకర్, నాగరాజు, రవీందర్ పాల్గొన్నారు.



**తిమ్మాపురంలో ఓటరు నమోదు పత్రాలు అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి**

### చాకలి ఐలమ్మ విగ్రహానికి రూ.50 వేల విరాళం

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాజిరెడ్డిగూడెంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి శుక్రవారం రజక సంఘానికి రూ.50 వేల విరాళం అందజేశారు. చాకలి ఐలమ్మ పోరాటాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, దాసరి సోమయ్య, కోమటి సోమయ్య, నిద్ర సంపత్, విక్రమ్ పాల్గొన్నారు.



## మేధస్సును పరీక్షించి.. జ్ఞాపకశక్తి పెంపొందించి

విద్యార్థుల్లో జ్ఞాపకశక్తితో పాటు నైతిక విలువలు, ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని జేజే నగర్‌లో గల నవోదయ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల' పాత్ర అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన డి.భానుప్రసాద్ (ప్రథమ), కె.అక్షర (ద్వితీయ), జి.మేఘన (తృతీయ)కు ఆ పాఠశాల కరస్పాండెంట్ మారం లింగారెడ్డి బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, జి.నర్సయ్య, జి.అంజయ్య, తదితరులు పాల్గొన్నారు. – సూర్యాపేట (మహాత్మాగాంధీరోడ్డు), న్యూస్‌టుడే:



## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



**అయిలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి**

చివ్వెంల, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి కోరారు. మండలంలోని అయిలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఏవో వెంకటేశ్వర్లు, సీసీ వెంకన్న పాల్గొన్నారు.

నూతనకల్: నూతనకల్‌లో మహిళా ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగం జయసుధ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీసాయి సరావు, ఎంపీడీవో సునీత, మండల వ్యవసాయ అధికారి మురళిబాబు, డీపీఎంలు అంజనేయులు, గోవింద్, సీసీ ముత్యాలు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని ఏనుబాములలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ హరిచంద్రప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎండీ.హసీం, ఏపీఎం మంజుల, పంచాయతీ కార్యదర్శి సర్వర్‌ఖాన్, సీసీలు చందునాయక్, సుదాకర్, యాదగిరి పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలోని ముకుందాపురంలో సంపు బంధం-1 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఏవో అనీసా రూహి, ఏపీఎం మొసయ్య, సంఘబంధం అధ్యక్షురాలు ముత్యాల విజయ, సీసీ రమేష్ పాల్గొన్నారు.

నాగారం: పస్నూరులో మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ బ్రహ్మయ్య ప్రారంభించారు.



**నూతనకల్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగం జయసుధ**




**బదిలీ అవుతున్న న్యాయమూర్తులు, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు**

### పరస్పర సహకారంతోనే

## న్యాయ వ్యవస్థ ముందుకు

☛ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయమూర్తులు, న్యాయవాదుల పరస్పర సహకారంతోనే న్యాయవ్యవస్థ ముందుకు సాగుతుందని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులకు శుక్రవారం సూర్యాపేట జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జిలు పి.శ్రీవాణి, కె.సురేష్, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతిలను బార్ అసోసియేషన్ తరఫున ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నూకల సుదర్శన్‌రెడ్డి, దపుకు మల్లయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కొంపెల్లి లింగయ్య, కాకి రాంరెడ్డి, నాతి సవీందర్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులూ.. ఓటు నమోదు చేసుకోండి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన వారు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, ప్రధానోపాధ్యాయులు దామెర శ్రీనివాస్, మాశెట్టి శ్రీనివాస్, సంజీవ పాల్గొన్నారు.

### వసతుల కల్పనపై శ్రద్ధ చూపండి

నూతనకల్, న్యూస్‌టుడే: విద్యార్థినులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతోపాటు వసతులు కల్పించడంలో శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి బాలు సూచించారు. నూతనకల్ మండలం గుండ్ల సింగారం కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నిధులతో చేపట్టాల్సిన పనులను గుర్తించి పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునిత, పాఠశాల ప్రత్యేక అధికారిని తన్నీరు మాధవి పాల్గొన్నారు.

### లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: వ్యవసాయానికి విద్యుత్తు లోవోల్టేజీ సమస్య లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామని సూర్యాపేట గ్రామీణం డిస్కం ఏడీఈ రాములు నాయక్ అన్నారు. మండలంలోని దూపహాడ్ విద్యుత్తు ఉప కేంద్రంలో రూ.1.20కోట్ల వ్యయంతో 8 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్తగా అమర్చి శుక్రవారం ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఏడీఈ ఇందిరారెడ్డి, ఏఈలు శ్రీనివాస్, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



**పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఏడీఈ రాములు నాయక్**

### 'ప్రధాన హామీలు విస్మరించిన ప్రభుత్వం'

చివ్వెంల, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అధికారంలోకి రాగానే తుంగలో తొక్కిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. కుడకుడ లెనిన్‌నగర్‌లో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కొన్నింటిని నెరవేర్చి ప్రధాన హామీలను సర్కారు విస్మరించిందని తెలిపారు. నాయకులు నాగయ్య, నర్సయ్య, గులాం హుస్సేన్, సంతోషిమాత, జయమ్మ, భాస్కర్, జానయ్య, పాల్గొన్నారు.

## వరిలో ఆకు ఎండు తెగులు

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: నిపుణుల సలహాలు పాటించి వరిలో అధిక దిగుబడులు సాధించాలని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, డి.ఆదర్శ్ అన్నారు. మండలంలోని ధర్మాపురం గ్రామంలో సాగుచేసిన వరి పంటలను ఏవో అనిల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. వాతావరణ మార్పుల కారణంగా వరిలో ఆకు ఎండు తెగులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఈ తెగులు సోకితే పంట దిగుబడులు తగ్గిపోయే ప్రమాదముందన్నారు. నివారణకు స్ట్రెప్టోమైసిన్ లేదా ప్లాంటా మైసిన్, లేదా అగ్రోమైసిన్ 80 గ్రాములు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వాతావరణంలో అధిక తేమ, అధిక వర్షాల కారణంగా ఎండు తెగులు కనిపిస్తోందని చెప్పారు. నత్రజని ఎరువుల మోతాదు తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు కనకయ్య, భద్రు, ప్రతాప్‌రెడ్డి, నాగు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



**ధర్మాపురంలో వరి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, ఏవో అనిల్‌కుమార్**



**ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తదితరులు**

## కేటీఆర్ పవర్ పాయింట్ ప్రదర్శన

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తమ హయాంలో మూసీ నది ప్రక్షాళనకు తీసుకున్న చర్యలపై శుక్రవారం పవర్ పాయింట్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో కలిసి సూర్యాపేటలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వీక్షించారు.

## 'కేంద్ర ప్రభుత్వానిది ద్వంద్వ వైఖరి'

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వం దేశవ్యాప్తంగా మాల, మాదిగలపై దాడులు చేయిస్తోందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఛైర్మన్ వీర్లాల వేణుబలరాం విమర్శించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశం కూడా పార్లమెంటులో బిల్లు పెట్టి రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ను సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చట్టం చేయకుండా ప్రధాని మోదీ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తూ మాదిగలపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ సమితి రాష్ట్ర కో ఛైర్మన్ జంగం కరుణాకర్, జిల్లా కో ఛైర్మన్ రవి, మురళి, బొయిల్ల అఖిల్, చెవుల రాము, సునీత పాల్గొన్నారు.




**సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఛైర్మన్ వీర్లాల వేణుబలరాం**

## సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శన

నూతనకల్ (గ్రామీణం), న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సౌత్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్టివల్ 2024 కార్యక్రమంలో శుక్రవారం సూర్యాపేట జిల్లా తరఫున పెదనెమిల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన ఇచ్చారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. 'వృక్షో రక్షతి రక్షితః' అనే అంశంపై చెట్లను మనం సంరక్షిస్తే.. అవి మన తరాలను రక్షిస్తాయని విద్యార్థులు నాటిక ప్రదర్శించారని పేర్కొన్నారు.



**రవీంద్రభారతిలో ప్రదర్శన ఇస్తున్న పెదనెమిల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు**

## 20న పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సభ

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల కలయిక సభను జయప్రదం చేయాలని సంఘ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ రంగారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాల ప్రేరణతో ఉస్మానియా యూనివర్సిటీలో జార్జిరెడ్డి నేతృత్వంలో పీడీఎస్‌యూ పురుడు పోసుకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటలు చేస్తోందన్నారు. న్యాయవాదులు లింగంపల్లి భద్రయ్య, కుంట్ల ధర్మార్జున్, ముప్పాని కృష్ణారెడ్డి, రాచురి ప్రతాప్, నారబోయిన వెంకట్, షేక్ సుభాని, న్యూడెమోక్రసీ నాయకులు గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ నాయకులు పోలెబోయిన కిరణ్ కుమార్, సింహాద్రి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## 21 నుంచి ఐద్వా మహాసభలు

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎం.వి.ఎన్.భవన్‌లో శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అతివలు హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో తంగెళ్ల వెంకటచంద్ర, మేకన బోయిన సైదమ్మ, సురభి లక్ష్మి, త్రివేణి, ఖాజాబీ, నాగమణి పాల్గొన్నారు.




**సూర్యాపేటలో ఐద్వా మహాసభల గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు**

## అవీ ఇవీ

**ప్రత్యేక పూజలు..** సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి ఆలయంలో అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు.

**బాధ్యతల స్వీకరణ..** తిరుమలగిరి: తిరుమలగిరి డిస్కం ఇన్‌ఛార్జి ఏఈగా మహేందర్, తిరుమలగిరి సబ్‌ఇంజినీర్‌గా గిరిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వారిని సిబ్బంది కలిసి శాలువాలతో సన్మానించారు.

**సన్మానం..** నాగారం: నూతనంగా ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన కె.మారయ్యను పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది శుక్రవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది సురేశ్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

**పోషకాహారంతోనే ఆరోగ్యం..** జాజిరెడ్డిగూడెం: గర్భిణులు పోషకాహారం తీసుకున్నప్పుడే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అర్వపల్లి పీహెచ్‌సీ ఇన్‌ఛార్జి వైద్యాధికారి నగేష్ అన్నారు. అర్వపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

**ధ్రువపత్రాల అందజేత..** పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: గ్రామాల్లో మంచి నీటి సరఫరాను సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. చేతిపంపుల మరమ్మతులు, మంచినీటి సరఫరా, నాణ్యత, క్లోరినేషన్ తదితర అంశాలపై మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ మంచి నీటి సహాయకులకు ఇచ్చిన శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం ధ్రువపత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

**జయప్రదం చేయండి..** కుడకుడరోడ్డు(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గీత పనివారల సంఘం వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న హక్కులను గీత కార్మికులు కాపాడుకోవాలని కోరారు. రేగట్టి లింగయ్య, తొట్ల ప్రభాకర్, బూర వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో.)

| రకం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| బీపీటీ | 3119 | 2066 |
| జైశ్రీరాం | 3029 | 2079 |
| ఐఆర్-64 | 2316 | 1830 |
| హెచ్ఎంటీ | 2439 | 1872 |
| పెసర | 6666 | 5495 |
| వేరుసెనగ | 4379 | 4379 |
| బొబ్బర్లు | 5559 | 5559 |
| మినుములు | 6732 | 6732 |
| మొక్కజొన్న | 1865 | 1759 |